## క్లుప్తంగా

### అంజిరెడ్డి కుటుంబ సభ్యులకు పరామర్శ



వాకా అంజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు

**చీమకుర్తి రూరల్:** చంద్రపాడు గ్రామంలో దివంగత ఎంపీటీసీ వాకా అంజిరెడ్డి పెద్దకర్మకు హాజరైన ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వాకా అంజిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించి అంజిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వాకా సంజీవరెడ్డి, ఎంపీటీసీ మాలకొండయ్య మహానందరెడ్డి, వెంకారెడ్డి యం.సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

### నేటి నుంచి పల్లె పండుగ

**నాగులుప్పలపాడు:** పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 4 కోట్ల 30 లక్షల రూపాయలతో మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న పల్లె పండుగ అభివృద్ధి కార్యక్రమాలు శుక్రవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మహాలక్ష్మి తెలిపారు. 18వ తేదీ చేకూరపాడు, నిడమానూరు, పోతవరం, ఒబన్నపాలెం, ముప్పాళ్ళ, మట్టిగుంట, కండ్లగుంట, 19వ తేదీ చదలవాడ, ఉప్పుగుండూరు, ఈదుమూడి, తక్కెళ్ళపాడు, 20వ తేదీ కనపర్తి, అమ్మనబ్రోలు, చవటపాలెం, రాపర్ల, మాచవరం, నాగులుప్పలపాడు, ఉప్పలపాడు, అగ్రహారం గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

**కొత్తపట్నం:** మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 2 గంటలకు ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించునున్నట్లు ఎంపీడీవో పి. కృష్ణ గురువారం తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యుడు హాజరు కావాల్సిందిగా కోరారు. జిల్లా, మండల అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరు కావాల్సిందిగా కోరారు. గైర్హాజరైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### గ్రానైట్ అక్రమ రవాణా అరికట్టండి

**ఒంగోలు వన్‌టౌన్:** ప్రకాశం జిల్లాలో గ్రానైట్ అక్రమ రవాణా అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందని ఏపీసీసీ అధికార ప్రతినిధి ఎస్కే సైదా గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గ్రానైట్ అక్రమ రవాణా ద్వారా వందల కోట్లు ప్రభుత్వ ఆదాయానికి గండి పడిందన్నారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన చీమకుర్తి గెలాక్సీ గ్రానైట్ 45 క్వారీల ద్వారా అధికారిక లెక్కల ప్రకారం రోజుకు 300 వాహనాల ద్వారా 3200 క్యూబిక్ మీటర్ల గ్రానైట్ తరలిస్తున్నారన్నారు. ఇదే సమయంలో అనధికారికంగా 3000 క్యూబిక్ మీటర్ల గ్రానైట్‌ను అక్రమంగా తరలిస్తున్నారని తెలిపారు. అక్రమార్జనకు అలవాటు పడి, మైనింగ్ మాఫియాకు సహకరిస్తున్న మైనింగ్, వాణిజ్య, ట్రాన్స్‌పోర్టు, రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలపై విజిలెన్సు విచారణ జరపాలని కోరారు.

### పంట నష్టం అంచనాలు తయారు చేయండి



సజ్జ పంటలను పరిశీలిస్తున్న జేడీ శ్రీనివాసరావు

**నాగులుప్పలపాడు:** తుఫాను ప్రభావం వలన మండలంలో ఇప్పటి వరకు సాగు చేసిన పంట నష్టం వివరలను క్షేత్ర స్థాయి సిబ్బంది త్వరితగతిన తయారు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. అధిక వర్షాల వలన మండంలోని దెబ్బతిన్న పంటలను గురువారం పరిశీలించిన జేడీ నాగులుప్పలపాడు గ్రామంలో రైతులతో కలిసి సజ్జ పంటను పరిశీలించి తగు జాగ్రత్తలు తెలిపారు. ఏవో వెంకట్రావు, వ్యవసాయాధికారులున్నారు.

### 22 నుంచి ఆధార్ క్యాంపులు

**మద్దిపాడు:** మండలంలో ఈనెల 22వ తేదీ నుంచి ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వి. జ్యోతి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవలు అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 22వ తేదీ మద్దిపాడు గ్రామ పంచాయతీలో మద్దిపాడు, వెల్లంపల్లి, ఘడియపూడి, నేలటూరు గ్రామాలకు చెందిన వారికి ఆధార్ అప్‌డేట్ చేయడం, ఇతర ఆధార్ సంబంధిత సేవలు అందిస్తారన్నారు. 23వ తేదీ గుండ్లాపల్లి సచివాలయం పరిధిలో గుండ్లాపల్లి, కీర్తిపాడు, రాచవారిపాలెం, అన్నంగి మల్లవరం కొలచనకోట, దొడ్డవరం గ్రామాల వారికి సేవలు అందిస్తారని 24వ తేదీ ఏడుగుండ్లపాడు సచివాలయంలో పెదకొత్తపల్లి, లింగంగుంట, ఏడుగుండ్లపాడు, దొడ్డవరప్పాడు గ్రామాల వారికి, 25న బసవన్నపాలెం సచివాలయ పరిధిలో బసవన్నపాలెం, సీతారాంపురం, ఇనమనమెళ్లూరు గ్రామాల వారికి ఆధార్ సంబంధిత సేవలు అందించనున్నట్లు తెలిపారు. గ్రామ కార్యదర్శులు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రజాప్రతినిధులకు అందరికి సమాచారం అందించాలని.. గ్రామల్లో టాంటాం వేయించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఈఏలు, ఎంఎస్‌కేలు, పంచాయతీ కార్యదర్శులు డీఏకు సహకరించాలని ఆదేశించారు.



ఆటోనగర్ మూడో లైన్‌లో వర్షపు నీరు



ఆటోనగర్ నాలుగో లైన్ వరదలో లారీ

# మేమేమి చేశాము పాపం?

- వసతుల లేమితో ఆటోనగర్
- మౌలిక వసతుల గురించి పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- తుఫాను వస్తే 15 రోజులపాటు పనులు బంద్



ఆరో లైన్ ఇలా..

**ఒంగోలు సిటీ:**

పేదల కష్టాలు పాలకులకు పట్టడంలేదు. వర్షం వచ్చిందంటే ఒంగోలు శివారులో ఉన్న ఆటోనగర్‌లో ఉన్న ప్రజలు, కార్మికులకు వెన్నులో వణుకు పుడుతోంది. ఎక్కడ ఏ గుంత ఉంటుందో తెలియక బయటకు వెళ్లడం కష్టంగా మారింది. ఎటు చూసినా గుంతలే రోడ్డులే.. సాయంత్రం చీకటి పడిందో.. అసలు రోడ్డు ఉందో లేదో కనిపించని దుస్థితిలో ఉంది. ఆటోనగర్ ఏర్పాటు చేసి 30 సంవత్సరాలైనా రోడ్లు, డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్, విద్యుత్ వంటి వసతలు నేటికీ కల్పించలేదు. కనీసం వీధుల్లో లైట్లు కూడా లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు..

**పన్నులు మాత్రం కావాలి**

ఆటోనగర్ ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉంది. అంటే ఆటోనగర్‌ను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులపై ఉంది. కానీ వారు మాత్రం ఇది తమ పరిధిలో లేదని.. ఏపీఐఐసీ పరిధిలో ఉందంటూ తప్పించుకు తిరుగుతున్నారు. కానీ ఆటోనగర్‌లో నివాసం ఉండే ప్రజలు, షాపుల యజమానులు మాత్రం ఇంటి పన్న, ఆస్తి పన్ను, కుళాయి పన్ను, చెత్త పన్ను తదితర పన్నులన్నీ మున్సిపల్ అధికారులకే చెల్లిస్తున్నారు. ఇంత చేస్తున్న కూడా వసతులు మాత్రం కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు.

**వలసలే దిక్కు**

ఆటోనగర్‌లో 2 వేల నుంచి 3 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఎక్కువగా కార్పెంటర్లు, వాహనాలకు సంబంధించిన ఇంజినీరింగ్ పనులు, లాజిస్టిక్ కంపెనీలు, మోటార్ వాహనాల కంపెనీలు తదితర సంబంధిత పనులు చేస్తుంటారు. అయితే ఇక్కడ ఆటోనగర్‌లో కనీస సదుపాయాలు లేకపోవడం వల్ల ఉమ్మడి జిల్లాలోని వాహనాలన్నీ విజయవాడకు తరలిపోతున్నాయి. నేషనల్ హైవే పైన ఆటోనగర్ అనే బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. ఇక్కడ వర్షం వచ్చిందంటే చాలు పది రోజులపాటు వీళ్ళకు పనిదొరకదు. కార్మికులు అప్పులు చేసి తినాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి రోజూ అరగంటపాటు కరెంటు పోతుంది. ఆటోనగర్‌కు ప్రత్యేకంగా ఫీడర్ ఏర్పాటు చేయాలని అసోసియేషన్ నాయకులు విద్యుత్ అధికారులను కోరినా స్పందించలేదు.



ఆటోనగర్ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

**సమస్యలు పరిష్కరించండి**



ఆటోనగర్ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు వంటి సమస్యలతో ఎంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్ళినప్పటికీ పట్టించుకోలేదు. దీంతో కార్మికులు రోడ్డున పడుతున్నారు.

ఆదం షరీఫ్: ఆటోనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్

**తాగు నీరు లేదు**



ఎన్నో ఏళ్లుగా రోడ్డు, డ్రైనేజీ, మంచినీరు లేక ఇబ్బంది పడుతున్నాం. కనీస సౌకర్యాలు లేకపోవడంతో కార్మికులు ఉపాధి లేకపోవడంతో ఇతర పనులకు వెళ్ళాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకొంటూ పనులు చేయడం లేదు.

సత్యన్, అసోసియేషన్ కార్యదర్శి

**వర్షం పడితే తిప్పలే..**



ఆటోనగర్ లో వర్షం పడితే 10 లేక 15 రోజులు పనులు లేనట్లే. ఈ సమయంలో కార్మికులు అప్పులు తెచ్చుకొని తింటున్నారు. ఆటోనగర్‌లో కనీస సౌకర్యాలు లేకపోవడం వల్ల ఉమ్మడి జిల్లాలోని వారంతా విజయవాడ వంటి ప్రాంతాలకు వెళుతున్నారు.

షేక్ అబ్దుల్ రహమాన్, జాయింట్ సెక్రటరీ

**ఆటోనగర్ రోడ్లపై నడవలేని పరిస్థితి**



ఉన్న రోడ్లన్నీ గుంతలతో అధ్వానంగా నడవలేని పరిస్థితి ఉంది. వర్షం పడితే ఎప్పుడు ఏ గుంతల్లో పడతామో తెలియని పరిస్థితి. డ్రైనేజీలు లేకపోవడం వల్ల నీరు ఎక్కడిపడితే అక్కడ నిలిచిపోతోంది.

సయ్యద్ నవాబు జానీ, యూనియన్ వైస్ ప్రెసిడెంట్



ప్రత్యేక అలంకరణలో కనకదుర్గా దేవి



సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు

# భక్తిశ్రద్ధలతో పౌర్ణమి పూజలు

**ఒంగోలు మెట్రో:** ఆశ్వయుజ మాసం పౌర్ణమి సందర్భంగా గురువారం ఉదయం నగరంలోని అమ్మవారి దేవాలయాలు లాయర్ పేట షిరిడీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారు, మంగమూరు రోడ్డులోని గాయత్రి మందిరంలో పంచముఖ గాయత్రీ అమ్మవారు, కేశవస్వామి పేటలోని ప్రసన్న చెన్నకేశవ స్వామి, దేవస్థానంలో రాజ లక్ష్మి అమ్మవారికి విశేష పూజలు జరిగాయి. అలాగే నగంలోని ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. అమ్మవారు దివ్యమైన రూపంతో ఆభరణాలు ధరించి భక్తులకు దర్శనమిచ్చారు.



పౌర్ణమి సందర్భంగా శ్రీగిరి గిరి ప్రదక్షణలో పాల్గొన్న భక్తులు

## పశువుల్లో గొంతు వాపు వ్యాధి ప్రమాదకరం

**నాగులుప్పలపాడు:** అధిక వర్షాల వలన సాధారణంగా పశువుల్లో గొంతు వాపు వ్యాధి సోకుతుందని దానికి సరైన సమయంలో వైద్యం చేయించుకోవాలని పశు సంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబిరాణి అన్నారు. మద్దిరాలపాడు రైతు సేవా కేంద్రం వద్ద గురువారం నిర్వహించిన ఉచిత పశువుల వైద్య శిబిరంలో జేడీ మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులకు మేత కొరత వస్తుందని తెలిపారు. దీని కోసం ప్రభుత్వం 75 శాతం సబ్సిడీపై సమీకృత దాణా అందజేస్తుందని తెలిపారు. ఇది పెడితే పాల దిగుబడి పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 35 పశువులకు గర్భకోశ వ్యాధులు, 15 పశువులకు సాధారణ వ్యాధులకు చికిత్స అందించారు. 100 దూడలకు గొంతు వాపు వ్యాధి టీకాలు, 10 దూడల్లో నట్టల నివారణ మందు అందించామని తెలిపారు. అనంతరం రైతులకు సబ్సిడీ దాణా అందజేశారు.



పశు వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జేడీ బేబిరాణి

## డీఎస్సీ ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**బేస్తవారిపేట/గిద్దలూరు రూరల్:** డీఎస్సీ ఉచిత శిక్షణకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బేస్తవారిపేట ఏఎస్‌డబ్ల్యూఓ ఈ.రాజేశ్వరమ్మ, గిద్దలూరు ఏఎస్‌డబ్ల్యూఓ ఎం.అమ్మాజి గురువారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవనంలో మూడు నెలలపాటు ఉచిత శిక్షణ ఇస్తారని, ఈ నెల 21వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు ఎంపిక పరీక్ష నిర్వహిస్తారని, వార్షికాదాయం రూ.2.50 లక్షలలోపు ఉండి, ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ విద్యార్హతలు కలిగిన అభ్యర్థులు అర్హులని స్పష్టం చేశారు.

## నీట మునిగిన పొలాలు

**మద్దిపాడు:** తుఫాన్ ప్రభావంతో మండలంలోని పలు చోట్ల పొలాలు నీట మునిగాయి. రబీ సీజన్‌కు సంబంధించి ఒకటి రెండు చోట్ల పంటలు వేసినా పంట కాపు దశకు రాకపోవడంతో నష్టం వాటిల్లే పరిస్థి తప్పింది. ప్రస్తుతం పొగాకు రైతులు పంట వేయడానికి సిద్ధమవుతున్నారు. కాగా గుండ్లాపల్లి గ్రామంలో రైతు లక్ష్మీనారాయణరెడ్డి పొలంలో నీరు నిలిచి పోయింది. సుమారు 20 నుంచి 30 ఎకరాల పరిధిలో వచ్చిన నీరు పొలంలో నిలిచి పోయింది. నీరు బయటకు పోవాలంటే ఘడియపూడి పునరావాసకాలనీ పై నుంచి వెళ్లాలి. దీంతో ఎన్ని రోజుల్లో నీరు బయటకు వెళుతుంతో తెలియని పరిస్థితి నెలకొంది.



గుండ్లాపల్లి వద్ద నీట మునిగిన పొలం

# సమన్వయంతో సేవలు అందించాలి



జీజీహెచ్‌ను తనిఖీ చేస్తున్న మంత్రి డోలా, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల

**ఒంగోలు టౌన్:** ప్రభుత్వ వైద్యశాలపై ప్రజలు ఎంతో నమ్మకంతో వైద్యం కోసం వస్తారని, వారి పట్ల విసుగు, చిరాకు ప్రదర్శించకుండా సేవాభావంతో వైద్య సేవలు అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి సూచించారు. గురువారం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కలెక్టర్ తమీమ్ అన్సారియాతో కలిసి ఆయన జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ గదులు, అత్యవసర సేవా విభాగం, ఫిజియోథెరపీ యూనిట్, కాన్పులు, పిల్లల వార్డులను ఆయన తనిఖీ చేశారు. విధి నిర్వహణలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోందని అసంతృప్తి వ్యక్తం చేశారు. వార్డుల్లో అనేక సమస్యలున్నాయని, వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సెక్యూరిటీ, పారిశుద్ధ్యంపై ఫిర్యాదులు వస్తున్నాయని, వెంటనే చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా.. సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. నగర మేయర్ గంగాడ సుజాత, పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ నూకసాని బాలాజీ, ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డా. ఏడుకొండలు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బాలజీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి భవన్ జలమయం





ప్రగతి భవన్ వద్ద నిలిచిన నీరు

**ఒంగోలు వన్‌టౌన్:** నగరంలోని ప్రగతిభవన్‌ను వర్షపు నీరు చుట్టు ముట్టింది. ప్రగతి భవన్ చుట్టూ వర్షపు నీరు చేరడంతో కార్యాలయంలోకి వెళ్ళాలంటే తడవాల్సి వస్తోంది. నగరంలో వర్షపు నీరు వెళ్లేందుకు చర్యలు తీసుకున్న అధికారులు, ప్రగతిభవన్ చుట్టూ నీరు చేరి నాలుగు రోజులు గడుస్తున్నా పట్టించుకోవడంలేదు. ప్రగతి భవన్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, బీసీ సంక్షేమ శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖలకు చెందిన జిల్లా అధికారులు దాదాపు 150 మందికి పైగా సిబ్బంది ప్రతి రోజూ కార్యాలయాలకు వస్తుంటారు. అయినా ఒక్క అధికారి కుడా సమస్యను పరిష్కరించలేదు. దక్షిణం వైపు గేటు నుంచి ప్రగతి భవన్‌లోకి వెళ్ళాలంటే వాహన దారులు నీటిలో పడిపోతున్నారు. దీంతో చుట్టూ తిరిగి బైపాస్ మీదుగా పడమర వైపు నుంచి కార్యాలయానికి వస్తున్నారు. ఈ వైపు కుడా వర్షపు నీరు నిలిచిపోడంతో పాటు గేటు బయట బురదమయం కావడంతో వాహనాలు మునిగిపోతున్నాయి.

# వాల్మీకి స్ఫూర్తి ప్రదాత



వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు సమర్పించిన స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు

**ఒంగోలు సిటీ:** రామాయణం అందించిన వాల్మీకి మహర్షిని స్మరించుకోవాలని స్టెప్ సీఈఓ ఎంవీఎస్ లోకేశ్వరరావు అన్నారు. గురువారం ఒంగోలు గవర్నమెంట్ ఆఫీసుల సముదాయంలో స్టెప్ కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న స్టెప్ సీఈఓ లోకేశ్వరరావు మాట్లాడుతూ భారతీయ జీవన విధానంలో వర్ణాలు, వృత్తులే ఉన్నాయన్నారు. కులాల పేరుతో విభజనలు లేవని వివరించారు. ఎవరు ఎక్కడ జన్మించినా, వారి జ్ఞానం, కృషి ఆధారంగానే ప్రాముఖ్యత ఉందనడానికి వాల్మీకి మహర్షి ఉదాహరణనన్నారు. పవిత్ర గ్రంథం రామాయణం రాసిన వాల్మీకి బ్రాహ్మణుడు కాదని.. ఒక గిరిజన కులానికి చెందినవారన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి బి.నారాయణ, గురుకుల పాఠశాల జిల్లా కోఆర్డినేటర్ జయ, స్టెప్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రపంచ శాంతికి బౌద్ధమే పరిష్కారం



నినాదాలు చేస్తున్న నాయకులు

**ఒంగోలు వన్‌టౌన్:** అంబేడ్కర్ బౌద్ధ ధర్మ స్వీకార దినోత్సవం.. ధర్మ పరివర్తన దినోత్సవం సందర్భంగా ప్రకాశం బౌద్ధ ధర్మ ప్రచారకుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం నగరంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం భవన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. అధ్యక్షత వహించిన డాక్టర్ సీహెచ్ సుధాకర్ బాబు మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో ఉన్న ఆర్థిక, సామాజిక, మతపరమైన, రాజకీయ సమస్యలకు ఏకైక పరిష్కారం బౌద్ధ ధర్మం అని తెలిపారు. ప్రపంచ జ్ఞాని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దూర దృష్టితో ప్రపంచంలో ఉన్న అన్ని మతాలను అధ్యనం చేసి.. ప్రపంచ శాంతికి, సర్వమానవ సంక్షేమానికి బౌద్ధమే మూలమని గుర్తించారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు చుండూరి రంగారావు మాట్లాడుతూ 1956లో అశోక విజయ దశమి రోజున అంబేడ్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడమే కాకుండా ఏడు లక్షల మందిని ప్రేరేపించారన్నారు. అంబేడ్కర్ వాదులంతా బౌద్ధ ధర్మాన్ని స్వీకరించాలని పిలుపునిచ్చారు. ఓపీడీఆర్ నాయకులు చావలి సుధాకర్ మాట్లాడుతూ దేశంలో అన్ని సమస్యలకు బౌద్ధమే పరిష్కారం అన్నారు. సీహెచ్ సుధీర్, ఎ. మహేష్ నాగ, బుద్ధకోటి తదితరులు పాల్గొన్నారు.

## రాయితీపై శనగ విత్తనాలు

**కొనకనమిట్ల:** రబీలో శనగ సాగు చేసే రైతులకు 25 శాతం రాయితీపై పప్పు శనగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ ప్రసన్న రంగలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని పెదారికట్ల, చింతగుంట రైతు సేవా కేంద్రాల పరిధిలోని రైతులకు ముందుగా శనగ విత్తనాలు అందజేస్తామని పేర్కొన్నారు.

**బేస్తవారిపేట:** బేస్తవారిపేట మండలానికి పప్పు శనగ విత్తనాలు 561 క్వింటాళ్లు కేటాయించినట్లు ఏడీఏ బాలాజీనాయక్ పేర్కొన్నారు. గురువారం నేకునాంబాద్‌లో పప్పుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఏఓ జక్కం మెర్సీ, వీఏఏలు పాల్గొన్నారు.